కాని ప్రపంచమందలి అన్ని దేశాలు ఆంగ్లంపై ఆధారపడివున్నాయా? అని అడుగవచ్చు. ఫ్రాంసు, జర్మన్, మొదలైన దేశాల్లో తమ భాషల్లోనే భావాభివ్యక్తి జరుగుచున్నప్పుడు భారతదేశమున కీదుర్గతి యెందుకు? హిందీకి ఆశక్తిలేదా? దీనికి ముఖ్యకారణం వారి శాస్త్రపరిశోధనా నైపుణ్యం; ఆదినుండి వారికి శాస్త్రపరిశోధన నిత్యావసరం. ఆ భావాలను తమ భాషల్లో వ్యక్తం చేసికోవటం వారికి పరంపరాగతమైన అభ్యాసం. కాని మన విద్యార్థులు నేడు ఆంగ్లభాషా పరిచయం లేకుండా విజ్ఞానాన్ని లేశమైన నేర్చుకోలేకపోతున్నారు. రష్యావారు శాస్త్రీయ పదజాలాన్నిలాటిన్ భాష నుండి గ్రహిస్తారు. అందుచేత ఆంగ్లాన్ని ఆశ్రయించవలసిన దురవస్థ వారికి పట్టలేదు.

కాని ఆంగ్లాన్ని పూర్తిగా తొలగించి ఆ స్థానంలో హిందీని తీసికొని రావలెనను ప్రయత్నం ప్రస్తుత పరిస్థితుల ననుసరించి దుస్సాహసం అది మన ప్రధాన సమస్యకూడా కాదు. శాస్త్ర చరిత్రాదులలో విద్యార్థులకు తీరని పిపాసను కల్గించడమే మన ప్రధానలక్ష్యం. ఈపనికూడ ఆంగ్ల సహాయం లేకుండా జరుగదు. కాబట్టి మన పాఠ్యప్రణాలిక నుండి ఆంగ్లాన్ని పూర్తిగా తొలగించటం ఇంకా కొంతకాలం హితకరంకాదు.

హిందీకి, ఇతర ప్రాంతీయ భాషలకు సమ్యగ్వికాసము చేకూర్చడానికి ప్రపథమమున విదేశ భాషలందలి ఉత్తమ గ్రంథాలకు దేశభాషల్లోకి అనువదించడానికి ఈ సంస్థ యత్నిస్తున్నది. ఇలాంటి సారస్వత, సాంస్కృతిక, శాస్త్రీయసంస్థలు చేయాల్సినసేవ ఎంతైనావుంది. మన గ్రంథాలకు విదేశ భాషల్లోకి తర్జుమా చేయటంకంటే విదేశ భాషా గ్రంథాలకు మనభాషల్లోకి ముఖ్యంగా హిందీలోకి తర్జుమా చేయటం, అత్యావసరం ఆంగ్లభాషా శృంఖలాలనుండి ముక్తి పొందవలెనంటే ఇదే మంచి ఉపాయం. అంతేకాదు, భారత దేశభాషల్లోవుండే సాహిత్యాన్ని సకల భాషలవారికి అందజేయవలసిన బాధ్యతకూడ ఈ సమితిపైవుంది.

క థా ని క

# సీతారాముడి ప్రేమ

వడ్లపట్ల దయానందం

"నిన్ను ప్రేమించాను"—అన్నాడు సీతారాముడు, పుల్లదానిమ్మగింజలు కళ్ళు మూసుకుని చప్పరిస్తూ.

ప్రక్కనే ఉన్న జామిచెట్టుమీద చిలక, పండు కోసం వెదుకుతూ కిచకిచమంది. పెరటి గోడ నానుకునే వీధివైపునకున్న, పెద్ద రావిచెట్టుమీద కోయిల, ఎగిరిపోతున్న తన జత పిట్టను చూచి, తనూ అరుస్తూ లేచిపోయింది.

పుల్లదానిమ్మగింజల రసం కళ్ళుమూసి దిగమ్రింగి, ఈ మాటవిని కళ్ళు తెరచాడు సీతారాముడు.

"కొంప ముంచేశావు!" అంది తాయారమ్మ చెట్టుకున్న దానిమ్మకాయకి గుడ్డ చుడుతూన్నదల్లా ఆగిపోయి.

తింటూవున్న పుల్లదానిమ్మ చెక్కని అలానే జారవిడిచేసి, రుమాలుతో మూతి తుడుచుకుంటూ, "ఏం?" అన్నాడు సీతారాముడు ఆందోళనగా.

"ఏం అంటావేమిటీ, నువ్వింతటి ఘనుడివని తెలిస్తే నీతో అసలు 'సోషల్'గా మూవ్' అయ్యేదాన్నే కాదు. ఏదో బుద్ధిమంతుడ వనుకున్నా" నెమ్మదిగా అంది, చూపుల్లో మాత్రం అగ్నివర్షం కురిపిస్తూ.

"తాయారూ! ప్రేమించటమే దోషం అంటావా? బుద్ధిమంతులు చేసే పని కాదంటావా?" ఫిలాసఫర్‌లా ముఖంపెట్టి ఆకాశంలోకి చూస్తూ, గంభీరంగా అన్నాడు సీతారాముడు.

అలా ఆకాశంలోకి చూస్తున్న సీతారాముడికి ఆ సంధ్యాసమయంలో నల్లటి మేఘాలు చింపి పారబోసిన కాగితపు ముక్కల్లా కన్పించినై.

తన పవిత్రప్రేమని- ఎంతోకాలంగా, అతినిగూఢంగా హృదయంలోనే దాచిపెట్టుకుని తీరా వెల్ల

డిస్తే పుల్లవిరుపుగా తీసి పారేసిన, తాయారు తీరు చూచేసరికి... తను చూస్తున్న ఆ నల్లటి మేఘాలు తనమీద విరుచుకు పడిపోతున్నట్లనిపించింది. తన అప్లికేషన్ ని కనీసం పరిశీలనలోకైనా తీసుకోకుండా త్రోసిపారేస్తుం దన్నది, సీతారాముడు కలలోకూడా ఊహించనట్టి విషయం.

తను 'తాయారు'ని ప్రేమిస్తున్నట్లు తెలుసుకోడానికి చాలాకాలం పట్టింది. పక్కింటి తాయారుని గురించి అప్పుడప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాడు నాలుగుసంవత్సరాల క్రితం. తర్వాత మూడోసంవత్సరంలో ఎప్పుడూ అదే ఆలోచన. అందుకేగా స్కూలుఫైనలు మొదటి సంవత్సరం తప్పి, క్రిందటిసంవత్సరమే రెండోసారి పాసయ్, ఇప్పుడు ఇంటరు మొదటియరు చదువుతూంట! లేకపోతే ఈపాటికి సీనియర్ కావలసింది.

అయితే ఒకసంవత్సరం చదువు పోయిందన్న చింతేనాడూ కలగలేదు. మీదుమిక్కిలి తాయారు సహపాఠి అయినందుకు, సంతోషాన్నే చేకూర్చింది. అప్పుడే చాటుగా ఎవరికీ తెలియకుండా మనసులో అనుకున్నాడు సీతారాముడు— "పోవడమే మించిదయింది లెద్దూ! లేకపోతే తాయారుతో జత లేకుండా...ఓ సంవత్సరం ముందు ఏడుస్తూ ఉండవలసి వచ్చేంది"అని.

అసలు కాలేజీలో చేరిననాటికి సైతం సీతారాముడుకి తెలియదు, తను తాయారుని ప్రేమిస్తున్నట్లు. ఒకనా డనుకున్నాడు విశ్రాంతి టైంలో: కాలేజీ బిల్డింగ్స్ కిదరినేఉన్న, రైలుకట్టకి దిగువలో ఆదరినున్న-ఈతపొదలమాటున కూర్చుని సిగరెట్ పీలుస్తూ,కనుచూపుమేరలో మిలమిలమెరుస్తూ మెలికలుతిరిగిపోతున్న పంటకాల్వవంక చూస్తూ గుండె మీద చేయివేసుకుని.

"నేనెప్పుడూ తాయారునుగురించే ఎందుకు ఆలోచిస్తాను?" అని ప్రశ్న వేసుకుని, కొంచెంసేపాలోచించుకుని మళ్ళా అనుకున్నాడు "అసలు తాయారునే పెళ్ళాడేస్తే?"

"అవును బాగానే ఉంటుంది."

"అయితే, మూడు సంవత్సరాలనుంచీ, తను తాయారుని గురించి ఆలోచిస్తున్న ఆలోచనలు, ఉత్త ఆలోచనలే కావన్నమాట! వాటివెనక, తనకి తెలియకుండానే, ప్రేమ పొంచి ఉన్నదన్నమాట! తను తాయారుని, మూడు సంవత్సరాల క్రితం నుంచే, ప్రేమిస్తున్నాడు."

ఈ నిశ్చయానికొచ్చాడానాడు, ఈనాటికి ఎనిమిదిమాసాలక్రితం ఈతపొదలచాటున కూర్చుని.

అప్పట్నుంచీ, ఎప్పుడూ ఇహ, ప్రేమతోనే చూచేవాడు తాయారువంక—అప్పుడప్పుడూ సిగ్గుపడుతూండేవాడు కూడా. ఈ ఎనిమిది మాసాల్లోనూ ఏనాడూ చూచాయగానైనా ఈవిషయం బయట పెట్టలేదు తను. ఇటీవల తాయారే, తనతో మరీ చనువుగా ప్రవర్తించటం మొదలుపెట్టింది. ఆ నోట్సూ ఈనోట్సూ కావాలని అడిగి తీసుకుంటూ, ఒక్కోసారి, తెలియని, పాఠ్యవిషయాలని తెలియజెప్పమంటూను. తననుకున్నాడు తాయారుయొక్క ఈ వ్యవహారంచూచి—

"ఫర్వాలేదు, తాయారు హృదయంలో సైతం తనమీద, ప్రేమలాంటిది మొలకెత్తుతోంది" అని.

ఇక తెలివైన సీతారావ్వుడు అప్పట్నుంచీ, తాయారుకి తెలియని విధంగా, ఆమొక్కకి, నీరు పోయ ప్రయత్నించి ఒకనాడు ఒక డజను మాగ్జన్లు కట్టగా కట్టితెచ్చి వాటిలో తను 'టిక్కు' పెట్టిన కథలు చదవమనిచ్చాడు తాయారుకి.

అన్నికథలూ చదివింది తాయారు— ●

దేనిలో చూచినా, ఇరుగుపొరుగు ఇళ్ళ అబ్బాయి, అమ్మాయి, చిన్నపట్నుంచి కలసి స్నేహంగా ఆడుకోవడమూ పెరిగి పెద్దవాళ్ళయి, ఆ అబ్బాయి ఆ అమ్మాయి వయసు వచ్చేసరికి, ఆ స్నేహం కాస్తా తకీల్ల ప్రేమగా రూపొంది పోవనమూ తర్వాతా ప్రేమపాశాలచేత గాఢంగా బంధించబడి పోవడమూ; అటూ, ఇటూ, పెద్దలంగీకరిస్తే సుఖాంతం కావడమూ లేనిపక్షంలో నాయకుడోలేక నాయకురాలో (సెంట్ పర్సెంట్ నాయకుడే లెండి) పిచ్చివాళ్లు కావడమో లేక ఏకంగా చచ్చిపోవడమో సంభవిస్తూంటుంది.

ఆట్టికథలుచదివాక, ఇక తాయారు ఉండబట్టలేక-"సీతారావ్వుడూ నిన్నునే ప్రేమించాను" అని తప్పక చెప్పేస్తుందని, ఆశించాడు సీతారాముడు.

కాని తాయారు ఏమీ మాట్లాడక ఏదో నవ్వుతూ, వాపస్ చేసేసిందా పుస్తకాలు. తాయారు నవ్వును చూచిన సీతారాముడు అది 'లవ్వే' అనుకున్నాడు. "సిగ్గువల్ల ధైర్యంగా చెప్పలేకపోయింది

కాని, తననుకున్నమాటే, తాయారుహృదయంలో ఉంది" అనుకుని సంతృప్తి పడ్డాడు. ఆతర్వాతో నాడు, డొంకతిరుగుడు వ్యవహారంలో, తాయారు హృదయాన్ని చూద్దామనుకున్న సీతారాముడు,

"తాయారూ నీ కెటువంటివాణ్ణి పెళ్ళిచేసుకోవాలని ఉంటుందీ" అనడిగాడు.

"నీలాంటి వాణ్ణే" అనేస్తుందనుకున్నాడు కాని.

"సీతారావుఁడూ ఇప్పుడే ఆ విషయం ఎందుకు పోనిస్తూ" అనేసింది తాయారు నవ్వి.

ఈసమాధానంవల్ల సైతం సంతృప్తినేపొందాడు.

"ఏం చెబుతుంది పాపం...తన రూపురేఖల్ని గుణగణాలని వర్ణించి అటువంటివాడినే పెండ్లాడుతానని, ఎలా చెబుతుంది? సిగ్గుకదూమరి- అందుకే అలా చెప్పలేక, ఇలా అనేసింది" అనుకున్నాడు.

సీతారావుఁడి పరిశోధనలు అక్కడితోనే ఆగిపోలేదు. పూర్వపు ప్రబంధాలు మొదలుకొని ప్రస్తుత నావెల్సువరకూ దేనిలో చూచినా కామన్‌గావున్న ఒక రహస్యాన్ని కనిపెట్టాడు. అదే "నాయకుని ఎడబాటుకు దురపిల్లేస్థితి."

వెంటనే దీనిమీద ప్రయోగం ప్రారంభిచాడు పదిరోజులపాటు కన్పించక, పదకొండవరోజున— పరితప్త అయిన తాయారుకి కన్పిస్తే హా-" సీతారావుఁడూ..వచ్చావా...నువ్వుకన్పించని కారణాన ఈ పదిరోజుల్నుంచీ నామనసులో ఏదోగాఉంది" అని ఎగిరి గంతువేస్తుందనుకున్నాడు.

కాని తాయారలా చేయలే. అయితేనేం... అలా సూటిగా అనేయడానికి సిగ్గుకదూ...అనుకుని ముఖాన్ని పరిశీలించాడు. తనకోసం బెంగకొని, ముఖం వాడిపోయినట్లే కన్పించింది. కళ్ళల్లో కాంతి సైతం తగ్గినట్లే కన్పించింది. మక్కీకిమక్కీ. నాయకుని యెడబాటు సహించలేక కృశించిపోయిన ప్రబందనాయిక, ప్రతిరూపమే తాయారు ముఖంలో గోచరించింది సీతారావుఁడుకి,

విజయగర్వంతో తనడిగాడు?

"తాయారూ అలా ఉన్నావేం?" అని.

అప్పటికైనా "సీతారావుఁడూ పదిరోజుల్నుంచి బొత్తిగా కన్పించటం లేదే" అని అడుగుతుందనుకున్నాడు.

"ఏం నే కన్పించకపోతే నీకెందుకాబాధ?" అని ఏడ్పించడానికి తను అందామనుకున్నాడు. కాని తాయారు అలాకూడా అడగలేదు.

"ఏం ఎలా ఉన్నాను" అనేసింది నవ్వుతూ. ఆ నవ్వులో పూర్తిగా బాధే గోచరించింది సీతారావుఁడుకి.

"ఛీ. తనెంతటి కరినాత్ముడు. ప్రేయసి హృదయాన్ని కనుగొనాలని, వినోదానికి ఎడబాటు కల్పించి అనవసరంగా తాయారు హృదయాన్ని నొప్పించానే" అని బాధపడ్డాడాక్షణంలో.

ఇలాగే ఎనిమిది మాసాలుగా బహిరంగంగా ప్రేమిస్తూ...ఇక ఉండబట్టలేక అక్షర లక్షల విలువ (తనదృష్టిలో) చేసే ఆ మాట తాయారు చేత అనిపించేదామని ఇంతకాలంగాదాచిపెట్టుకున్న సీతారావుఁడే ముందనేశాడామాట. తీరా అనేస్తే తానాశించినట్లుగాక పిడుగులాంటి సమాధానం వెలుడింది—తాయారు మృదువైన పెదవులనుండి.

"ప్రేమించటమే దోషమంటావా?" అన్న సీతారావుఁడు ప్రశ్నకి.

"కాదనుకో—నేను ప్రేమించక పోవడంకూడా దోషం కాదుగా?" అంది తాయారు తిరుగు ప్రశ్న రూపంలో సమాధానిస్తూ.

తాయారీమాటనటంతోనే ఆకాశంలోని నల్లటి మేఘాలు మండి, గిరుక్కున తాయారువైపు దృష్టి మరిల్చాడు సీతారావుఁడు.

"నువ్వింత మోసగిస్తావని అనుకోలా. అసలు తిరస్కరించడానికి కారణం ఏమిటీ?" ఖచ్చితంగా అడిగేశాడు చిన్న దానిమ్మ రెమ్మని ఏమీతోచక ఫెళ్ళున విరిచేస్తూ.

"దీనిలో మోసం ఏముంది? ఇకమీదట ఉద్దేశం మార్చుకుని మసులుకోమంటాను. నా ఇష్టమొచ్చిన వాళ్ళని ప్రేమించడానికి నాకూ స్వేచ్ఛఉందిగా?" అంది తాయారు తేల్చి చెప్పివేస్తూ.

దీనితో, అవమానంతో కూడుకున్న కోపం, సీతారావుఁడు హృదయంలో బుసబుస పొంగిపోయింది. "తనంతటివాడు పోనీలెమ్మని ప్రేమిస్తే కాదని మరొవాణ్ణి ప్రేమిస్తుందా? నిజంగా తనకెంత అవమానం." కోపంతో మండిపడుతూ— "అయితే నువ్వు ప్రేమించిన, ఆ వెధవనే చేసుకో- నాకూ మంచిదే ..నీకంటే మంచిదే నాకు దొరకకపోదు." మండిపడుతూ అని విసురుగా ముందుకి నడిచాడు సీతారాముడు...

★